క్లుప్తంగా

పంట నష్టపోయిన రైతుల జాబితా ప్రదర్శన

శ్రీకాకుళం(ఘంటసాల): పంటలు నష్టపోయిన రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు ఎంఏవో కె.మురళీ కృష్ణ బుధవారం తెలిపారు. ఆగస్టు నెలాఖరుకు, సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలో పంట పొలాల్లో 33 శాతం పైగా నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి శ్రీకాకుళం, పాపవినాశనం గ్రామాలకు చెందిన రైతుల వివరాలను ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి బుధవారం ప్రదర్శించారు. ఏవో మాట్లాడుతూ మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల్లో ఆయా గ్రామాలకు చెందిన రైతుల వివరాలను నోటీసు బోర్డుల్లో ప్రదర్శించినట్లు చెప్పారు. జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో ఈ నెల 16వ తేదీ లోపు ఆయా రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయశాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. సరి చేసి 17వ తేదీన తుది నివేదకను జిల్లా స్థాయి అధికారులకు అందిస్తామని చెప్పారు. శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), కుంపటి చిట్టి బాబు, మాజీ ఎంపీటీసీ ఆత్కూరి సీతా రామరాజు, సెరీకల్చర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, వీఏఏలు జి.దయానా, ఎం.లావణ్య, రైతులు పాల్గొన్నారు.

22న ఉచిత కంటి వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగాయలంకలోని మారుతీ విద్యా నికేతన్ డిజిటల్ స్కూలు ఆవరణలో ఉదయం గం.9 నుంచి ఒంటి గంట వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు. సంబంధిత నేత్ర వైద్య పరీక్షల వివరాల కోసం మొబైల్ నంబర్లు 94906 36466, 70936 17778లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. శుక్లాలు ఉన్న వారికి కంటి లోపల అద్దాలు అమర్చే ఆపరేషన్‌లు (ఐఓఎల్) శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని శేఖర్ పేర్కొన్నారు.

కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు



గూడూరు: పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా మండలంలోని ఆకుమర్రు ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం కిశోర బాలికలకు క్విజ్ పోటీలు, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఐసీడీఎస్ మచిలీపట్నం ప్రాజెక్టు ఆధ్వర్యంలో మల్లవోలు సెక్టారు సూపర్‌వైజర్ జన్ను రేవతి ఆధ్వర్యంలో జరిగిన పోటీలలో పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు. క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం కిశోరబాలికలకు రక్త పరీక్షలు నిర్వహించి రక్త హీనత ఉన్న వారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వరిగంజి లక్ష్మీకుమారి, కారుమంచి మమత, ఉపాధ్యాయులు గోళ్ల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ చేయించుకోవాలి



వెంకటాపురం(మోపిదేవి): రైతులంతా ఈ క్రాప్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి హెప్సిభారాణి సూచించారు. మండలంలోని పలుగ్రామాల్లో వరద, భారీ వర్షాల ముంపునకు గురైన పంట పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటాపురంలో రైతులతో మాట్లాడుతూ తమ పంటలను తప్పని సరిగా ఈ క్రాప్ చేయించుకోవాలని తద్వారా మార్కెట్‌లో పంట అమ్మకానికి, పంట నష్టం ప్రభుత్వం నుంచి అందుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. వీఏఏ, వీహెచ్ఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

రావివారిపాలెం(మోపిదేవి): మండల కేంద్రం మోపిదేవి శివారు రావివారిపాలెం పాలకేంద్రం వద్ద 2023–24 ఆర్థిక సంవత్సరానికి సొసైటీ తరపున పాల ఉత్పత్తిదారులకు బుధవారం బోనస్ పంపిణీ చేశారు. పాలకేంద్రం అధ్యక్షుడు రావి లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పామర్రు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ సీహెచ్ గోపీనాథ్ ముఖ్యఅతిథిగా బోనస్ అందజేశారు. 140 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.1,46,454 బోనస్‌గా ఇచ్చారు. కేంద్రానికి పాలుపోయడంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన బూసి బాబూరావు, రావి శ్రీధర్, బడుగు బాబూరావులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఏరియా సూపర్‌వైజర్ మోర్ల వర ప్రసాద్, మాజీ అధ్యక్షుడు బండి రామకృష్ణ, రావి ప్రభు ప్రసాద్ (బుట్టో), సంఘ సభ్యులు పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.



పెడన మఠం వీధి వినాయకుని గుడి వద్ద ప్రత్యేక పూజలు



పెడన మండలం కోటవానిపాలెంలో నిమజ్జనోత్సవం



పెడన మఠం వీధి వద్ద అన్నసమారాధన



మచిలీపట్నం టౌన్‌లో రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గణనాథునికి దీపాలతో అలంకరణ



పెడన 15వ వార్డులో వినాయకుని ఊరేగింపులో నృత్యాలు

గణేశ్ విగ్రహాలకు పూజలు..నిమజ్జనోత్సవాలు

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లోను, కూడళ్లలోను నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలు బుధవారం ఐదో రోజుకు చేరాయి. కొందరు నవరాత్రులు నిర్వహిస్తుండగా మరికొందరు ఐదు రోజులు పూర్తికావడంతో భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. పలు చోట్ల వినాయకుని చేతిలోని లడ్డూలను వేలం వేశారు. అనంతరం లంబోదరుడ్ని ఊరేగింపుగా నిమజ్జనం చేసేందుకు తరలించారు. యువత పెద్ద ఎత్తున డీజే సౌండ్ సిస్టమ్‌లు ద్వారా నృత్యాలు చేస్తూ ఉల్లాసంగా ఉత్సాహంగా నిమజ్జనం చేశారు.

–మచిలీపట్నం టౌన్/పెడన/మోపిదేవి/గూడూరు/బంటుమిల్లి



మచిలీపట్నం టౌన్‌లో వినాయకుని పూజలో కూర్చున్న శ్రీనివాసరావు, లావణ్య దంపతులు



మోపిదేవిలో ఊరేగింపులో పాల్గొన్న మహిళా భక్తులు



కోడూరులో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



నాగాయలంకలో గణపతి హోమంలో చైర్మన్ శ్రీనివాసరావు, సుజనకుమారి దంపతులు



బంటుమిల్లి మండలం మల్లేశ్వరంలో గణనాథునికి పూజలు



బంటుమిల్లి లక్ష్మీనారాయణపురం అన్నసమారాధలో భక్తులు



గూడూరులో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



మచిలీపట్నం టౌన్ రైతుబజారులో పూజలందుకుంటున్న గణనాథుడు

పేదల సమస్యల పరిష్కారానికి 'పేర్ని' కృషి



పేర్ని కృష్ణమూర్తి, నాగేశ్వరమ్మ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ

వర్ధంతి కార్యక్రమంలో పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నియోజకవర్గంలోని పేదల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించిన మాజీ మంత్రి పేర్ని కృష్ణమూర్తి ప్రజానాయకుడిగా పేరొందారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. మాజీ మంత్రి కృష్ణమూర్తి 25వ వర్ధంతి బుధవారం నగరంలోని 1వ డివిజన్ పీకేఎం కాలనీలో కృష్ణమూర్తి విగ్రహం వద్ద నిర్వహించారు. కృష్ణమూర్తి, ఆయన సతీమణి నాగేశ్వరమ్మ దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలకు కృష్ణమూర్తి ఎనలేని బాంధవ్యం ఉందన్నారు. ఆర్టీసీ, రిక్షా, బెల్ ఎంప్లాయీస్ యూనియన్లే కాకుండా ఎన్నో అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై కృష్ణమూర్తి అలుపెరగని పోరాటం చేశారన్నారు. తీర ప్రాంత గ్రామాల ప్రజల దాహార్తి తీర్చేందుకు తరకటూరులో 200 ఎకరాల విస్తీర్ణంలో సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు ఏర్పాటుకు ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ స్కీం ద్వారా మచిలీపట్నం నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాలతో పాటు నగరపాలక సంస్థ, పెడన మునిసిపాల్టీ పరిధిలోని ప్రజల దాహార్తి తీరుతోందన్నారు. నగరమేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ పేర్ని కృష్ణమూర్తి పేదలకు నివేశనా స్థలాలు ఇచ్చి ప్రజలు మెచ్చిన నాయకుడిగా పేరొందారన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, కార్పొరేటర్లు జోగి చిరంజీవి, ఐనం తాతారావు, పల్లి శేఖర్, కో ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, మట్టా తులసమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు చిటికిన నాగేశ్వరరావు, బత్తిన వాసు, మిరియాల రాంబాబు, మన్నే శేషారావు, షేక్ మొహమ్మద్‌సాహెబ్, బూరగ రామారావు తదితరులు పాల్గొని పేర్ని కృష్ణమూర్తికి నివాళులర్పించారు.

ఇంజిన్లు, మోటార్ల చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇంజిన్లు, మోటార్లు

బంటుమిల్లి: మండల పరిధిలో ముగ్గురు వ్యక్తులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేసి ఆయిల్ ఇంజిన్లు, కరెంటు మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. మండల పరిధిలోని బంటుమిల్లి, చినతుమ్మిడి, జయపురం గ్రామాలకు చెందిన అంకెం నాగేంద్రకుమార్, అబ్దుల్‌జమీల్, ఈడె వెంకటనారాయణ(నాని)లను అరెస్ట్ చేసి విచారించగా వారు చేసిన దొంగతనాలను అంగీకరించారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు 5 ఆయిల్ ఇంజిన్లు, 18 కరెంటు మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఎం.భాస్కరరావు రిమాండ్ విధించారు. వారు దొంగిలించిన సామాన్లకు సంబంధించి బంటుమిల్లి పోలీసు స్టేషన్ పరిధిలో 7 కేసుల్లో 10 మోటార్లు, పెదపారుపూడి పోలీసు స్టేషన్‌లో 3 కేసుల్లో 7 మోటార్లు, గుడ్లవల్లేరు పీఎస్ పరిధిలో రెండు కేసుల్లో రెండు మోటార్లు, కృత్తివెన్ను పీఎస్‌లో ఒక కేసులో ఒక మోటారు చోరీ కేసులు నమోదై ఉన్నాయి. మరో మూడు మోటార్లు ఎక్కడ దొంగిలించిందీ సమాచారం రాలేదు. గత నెల 29వ తేదీన ఆయిల్ ఇంజిన్లు దొంగిలించిన కేసులో అరెస్ట్ అయిన ఇద్దరు వ్యక్తులను విచారించగా ఈ వ్యవహారం బయటపడింది.

రహదారి అభివృద్ధి

శ్రీకాకుళం(ఘంటసాల): మండలంలోని శ్రీకాకుళం గ్రామంలోని కరకట్ట నుంచి కృష్ణానదిలోకి వెళ్లే రహదారి గుంతలమయంగా మారి వినాయక విగ్రహాల నిమజ్జనానికి భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంపీటీసీ చిన్నా కరకట్ట నుంచి కృష్ణానదిలోకి వెళ్లే రహదారిని తన సొంత ఖర్చులతో భక్తులకు ఇబ్బందుల్లేండా జేసీబీ సాయంతో చదును చేయించి, పిచ్చి మొక్కలను తొలగించారు. దీంతో ఇబ్బందులు తొలగిపోయాయి. టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మత్స్యకారులకు ఎమ్మెల్యే పరామర్శ

నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలోని చిన కరకట్ట కింద నివాసిత ప్రాంతంలో వరద ప్రభావిత మత్స్యకార కుటుంబాలను ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ బుధవారం పరామర్శించారు. జరిగిన నష్టాన్ని మత్స్యకారులు ఎమ్మెల్యేకు వివరించగా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సర్పంచ్ కైతేపల్లి అంకాలు, ఉపసర్పంచి తలశిల నాని, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, శ్రీరామపాదక్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, కార్యదర్శి జరుగు పవన్‌కుమార్, మత్స్యసంఘాలప్రతినిధులుల నాగాంజనేయులు, తాతారావు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కోడూరు: భారీ వర్షాలు, వరదలు తొలగడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై అధికారులు దృష్టి సారించారు. కోడూరు పంచాయతీ పరిధిలోని కృష్ణాపురం, నరసింహపురం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, యర్రారెడ్డివారిపాలెం, నాయుడుపేట, దింటిమెరక గ్రామాల పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు రహదారులకు ఇరువైపులా, మురుగు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లారు. హంసలదీవి పంచాయతీ పరిధిలోని పాలకాయతిప్ప, హంసలదీవి గ్రామాల్లో శానిటేషన్ నిర్వహించి, దోమల నివారణ మందును పిచికారీ చేశారు. సర్పంచులు వెన్నా షైనీ, కొక్కిలిగడ్డ భిక్షాలు పనులను పర్యవేక్షించారు.

కుళాయి కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోండి

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు కుళాయి కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ బాపిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తుదారులకు తాగునీటి కుళాయి కనెక్షన్‌ను ఇస్తామన్నారు. ఇంటింటికీ కుళాయి పథకంలో భాగంగా లబ్ధిదారులకు పైపులు ఉచితంగా వేస్తామన్నారు. దరఖాస్తులను సచివాలయాల్లో తీసుని రేషన్, ఆధార్ కార్డులు, ఆస్తి ధ్రువపత్రాలు, నోటరీ, పన్ను బకాయి లేని రసీదు నకళ్లను జత చేయాలన్నారు. వీటిని నగరపాలక సంస్థ కార్యాలయలలోని ఇంజినీరింగ్ విభాగంలో ఈ–3 సెక్షన్‌లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందజేయాలన్నారు.



నాగాయలంక కృష్ణానదిలో శ్రీరామ పాదక్షేత్రం వద్ద వరద ప్రవాహం నెమ్మదించింది. నిర్మలంగా బంగాళాఖాతంలోకి సాగుతున్న కృష్ణమ్మ చెంత తన ప్రతిబింబాన్ని చూస్తున్నట్లుగా కృష్ణవేణి విగ్రహం కనిపిస్తోంది. ఈ సుందర దృశ్యాన్ని బుధవారం ఘాట్ సందర్శకులు తమ ఫోన్లతో బంధించారు. – నాగాయలంక

బాధిత కుటుంబానికి సాయం



చెక్కును అందజేస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: స్థానిక బైపాస్‌రోడ్డు ప్రాంతానికి చెందిన పుట్టి రమేష్ రెండేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందినప్పటికీ వ్యాధి తగ్గకపోగా తీవ్ర అనారోగ్యంతో గత నెలలో మృతి చెందాడు. చికిత్స కోసం రమేష్ కుటుంబం అప్పులు చేసింది. ప్రస్తుతం వారికి ఇల్లు గడవటమే కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న మైత్రి ఫౌండేషన్ నిర్వాహకులు బుధవారం రమేష్ కుటుంబానికి రూ.13 వేల విలువైన చెక్కును అందజేశారు. రమేష్ కుటుంబ సభ్యులు మైత్రి ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు కె.వేణుకుమార్, గౌరవాధ్యక్షుడు వరప్రసాద్, కార్యదర్శి రాధాకృష్ణ, సభ్యులు కనకరాజు, వక్కంటి రమాదేవి, దీప్తి, ఆదిశేషు పాల్గొన్నారు.

మోపిదేవి: మండలంలోని బొబ్బర్లంక గ్రామంలో 300 మంది వరద బాధిత కుటుంబాలకు టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం ఆధ్వర్యంలో బుధవారం సాయం అందించారు. రూ.12 లక్షలతో 2,100 మంది వరద బాధితులకు ఇప్పటి వరకు సాయం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. బొబ్బర్లంకలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు చేతుల మీదగా దుప్పట్లు, చీరలు, లుంగీలు, టవల్స్‌తో కూడిన కిట్లను అందజేశారు. టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం ప్రతినిధి బుచ్చి రామప్రసాద్, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, గ్రామ సర్పంచ్‌లు దొప్పలపూడి గంగాభవానీ, ఎంపీటీసీ దిడ్ల రాణి, తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, టీడీపీ మండల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, వీఆర్వో నీల్‌కాంత్, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరావు, కోనేరు శివలీల, కోనేరు నాగేశ్వరావు, చంద్రమౌళి పాల్గొన్నారు.

కె.కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె.కొత్తపాలెం ఎస్సీకాలనీలో వరద బాధితులకు బుధవారం ఇఫ్కో సంస్థ భోజనంతో పాటు రగ్గులు అందజేశారు. ఆ సంస్థ మార్కెటింగ్ రాష్ట్ర మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ నందకిషోర్‌రెడ్డి నేతృత్వంలో గ్రామ సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి చేతుల మీదగా బాధితులకు అందజేశారు. మండల కోఆప్షన్ సభ్యులు చందన రంగారావు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



బొబ్బర్లంకలో బాధితులకు సాయం అందిస్తున్న ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

వరద బాధిత కుటుంబాలకు సాయం

చల్లపల్లి(అవనిగడ్డ): మండల పరిధిలోని ఆముదార్లంకలో వరద బాధిత కుటుంబాలకు ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ (ఐవీఎం) ఆధ్వర్యంలో రూ.4.81 లక్షల విలువైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బుధవారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో 400 మంది బాధితులకు ట్రస్ట్ చైర్మన్ వేములపల్లి సురేష్–రోజా దంపతులు సమకూర్చిన నిత్యావసర సరుకులు, దుప్పట్లను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ద్వారా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద బాధిత ప్రాంతాల్లో ఐవీఎం ద్వారా ఇప్పటి వరకూ 1,500 మంది బాధితులకు రూ.12 లక్షల విలువైన నిత్యావసర వస్తువులు, దుస్తులు, దుప్పట్లు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ (రాజా), సర్పంచ్ నడకుదిటి ఆదిలక్ష్మి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, టీడీపీ నాయకులు ముమ్మనేని నాని, అయినంపూడి భానుప్రకాష్, కార్యదర్శి నాగరాణి, వీఆర్వో అవనిగడ్డ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఎంపీడీవో సాయం



పులిగడ్డ(అవనిగడ్డ): ఇటీవల వరదకు మండల పరిధిలోని పులిగడ్డ రేగుల్లంకలో ఇంట్లోని వస్తువులు, బుక్స్ కొట్టుకుపోయిన ఇద్దరు విద్యార్థినులకు ఎంపీడీవో మరియాకుమారి, సీతాయిలంకకు చెందిన కంచర్ల కోటేశ్వరరావు రూ.6 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. వరద నీటికి రేగుల్లంకకు చెందిన దిడ్ల పవిత్ర, ఆరిగ వీణకు చెందిన వస్తువులు, బుక్స్ వరద నీటిలో కొట్టుకుపోవడంతో కట్టు బట్టలతో మిగిలారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో మరియాకుమారి, కంచర్ల కోటేశ్వరరావు చెరో రూ.6 వేలను విద్యార్థినులకు అందించారు. దాతలు ముందుకు రావాలని కోరారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ దాసరి విజయకుమారి, ఈవోపీఆర్డీ సుందరి, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ మండలి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అనిత, గొర్రుముచ్చు సురేష్ పాల్గొన్నారు.

వాణిజ్య పంటల పరిశీలన

బొబ్బర్లంక(మోపిదేవి): వరద ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన వాణిజ్య పంటలను ఎమ్మెల్సీ అశోక్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలసి బుధవారం పరిశీలించారు. మండలంలోని బొబ్బర్లంకలో తడిచిపోయిన, కుళ్లిపోయిన పసుపు, కంద, అరటి వంటి వాణిజ్య పంటలను బుధవారం పరిశీలించారు. తడిచిపోయిన పసుపు కొమ్మును ఆరపెడుతున్న రైతు బాలరామకృష్ణతో మాట్లాడారు. పెట్టుబడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 8 ఎకరాల్లో పసుపు పంట వేశామని, సుమారు రూ.40 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని వాపోయారు. పసుపుకొమ్ము తడవడంతో రంగు మార్పు వస్తుందని, దీని వల్ల కొనుగోలు కూడా తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రంగుమారిన పసుపు మార్కెట్ ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయించాలని వారిని కోరారు. తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, సర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని, ఎంపీటీసీ దిడ్ల రాణి, మండలి వెంకట్రామ్, కోనేరు శివలీల, కోనేరు నాగేశ్వరావు, కోనేరు చంద్రమౌళి, వీఆర్వో నీల్‌కాంత్, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన



పులిగడ్డ(అవనిగడ్డ): మండల పరిధిలోని పులిగడ్డ గురుకుల పాఠశాలను ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఎంపీడీవో మరియాకుమారి, సర్పంచ్ దాసరి విజయకుమార్ బుధవారం సందర్శించారు. ఈ పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులు జ్వరాల బారిన పడిన విషయం విదితమే. పాఠశాలలో విద్యార్థులను ఎంపీపీ, ఎంపీడీవో, సర్పంచ్ పరామర్శించారు. ప్రిన్సిపాల్ కుమార్‌తో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. జ్వరాలు ఎక్కువగా ఉన్నవారిని తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లారని చెప్పారు. ఇక్కడున్న వారంతా బాగానే ఉన్నారని, జ్వరాలు కూడా తగ్గుతున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు.